క్లుప్తంగా

దేశభక్తిని పెంపొందించుకోవాలి

నగరం: దైవ భక్తితో పాటు దేశ భక్తిని పెంపొందించుకోవాలని బాల వికాస్ జిల్లా కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి చెప్పారు. గణతంత్ర దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం నగరంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థాన కల్యాణమండపంలో సమర సత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాత పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలను అర్పించారని వారి త్యాగఫలాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. తూర్పుపాలెం సర్పంచి తూము రమాదేవి, జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమ శంకర్రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సూరేపల్లి(భట్టిప్రోలు): మండలం పరిధిలోని సూరేపల్లి వీపీఅండ్‌జీఎస్ఎం హైస్కూల్‌లో భట్టిప్రోలు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ), నాబార్డ్ వారి అక్షరాస్యత నిధుల (ఎఫ్ఐఎఫ్) ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధులు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ

రేపల్లె రూరల్: మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిమి బాలాజీ సహకారంతో పట్టణంలోని ఓ కల్యాణమండపంలో శనివారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తానా చైతన్య స్రవంతి కార్యక్రమంలో భాగంగా గత నెలలో శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందంచే నిర్వహించిన వైద్యశిబిరంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న 165 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు రామకష్ణబాబు, కార్యదర్శి బాపారావు, మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ళ ప్రకాశరావు, శంకర కంటి ఆసుపత్రి సూపర్‌వైజర్ నాగబాబు పాల్గొన్నారు.

నేడు చెరుకుపల్లిలో నేత్ర వైద్యశిబిరం

రేపల్లె: నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో వాసవీ క్లబ్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 22వతేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపర్‌వైజర్ నాగబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శస్త్ర చికిత్సలకు వచ్చే వారు ఆధార్ జిరాక్స్‌లను తమ వెంట తీసుకురావాలన్నారు. కంటి సమస్యలతో బాధపడేవారు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి. నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. నల్లమోతువారిపాలెం సచివాలయం కన్వీనర్లకు, సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు శనివారం ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు జరిగింది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుంటా రత్నబాబు, పంచాయతీ కార్యదర్శి సువర్చల తదితరులు పాల్గొన్నారు.

ఏజీ కళాశాల అతిథి భవనానికి రూ.2లక్షలు విరాళం

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు సందర్భంగా కళాశాలలో అతిథి భవనం నిర్మాణానికి ఆలిండియా యూనియన్ బ్యాంకు ఆఫీసర్స్ కాంగ్రెస్ రూ.2లక్షలను విరాళంగా అందించింది. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డికి చెక్కును ఆఫీసర్స్ కాంగ్రెస్ చైర్మన్ ఎంఎం భాస్కరరావు, అధ్యక్షులు సయ్యద్ అల్లాబక్షి, ఎం.సూర్యనారాయణరాజు అందించారు. ఈకార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఉన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మున్వర్ బాషా

కర్లపాలెం: యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా కర్లపాలెం ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ మున్వర్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం శనివారం ఎంపీ రాజుపాలెం ఉర్దూ పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వైవీ నారాయణ గౌరవ అధ్యక్షుడిగా జె.డేవిడ్‌తో పాటు మరో 20మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. యూటీ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు సీహెచ్ ప్రభాకర్, ఆర్.రమేష్, ఎండీ అక్రమ్ గోరీ, బి.భానుప్రకాష్, వై.భాస్కర్‌రావు, ఎన్.కోటేశ్వరరావు, కె.విమలమ్మ, జె.శ్యామ్‌సుందర్, ఇ.పోలీసరావు పాల్గొన్నారు.

రాచూరులో పశు వైద్యశిబిరం

రాచూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం అక్లమూడి పశు వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం రాచూరులో పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచి జయవరపు రాధా కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు దున్నా తిరుపతిబాబు పర్యవేక్షణలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరిలు ప్రారంభించారు. శిబిరంలో 40 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 10 దూడలు, 40 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.


బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎంపీ జీవీఎల్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, పోతుల సునీత, ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు – బాపట్ల


మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు


ఎడ్లబండిపై వస్తున్న వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి

సత్ప్రవర్తనతో కూడిన జీవితం అవలంభించాలి

– సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు



రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంభించాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌జైలులో ఖైదీలకు శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన పొరపాట్లతో ఇబ్బందులుపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎటువంటి పొరపాట్లు చేయాల్సిన పరిస్థితులు ఉండవన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జగదీష్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్

- పల్లపట్లలో గడప గడపకు మన ప్రభుత్వం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవితో కలిసి పాల్గొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున


మహిళతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: సంక్షేమ పథకాల రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన పాలన సుస్థిరంగా సాగాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పల్లపట్ల గ్రామంలో శనివారం మూడో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావుతో పాటు మంత్రి పాల్గొని మాట్లాడారు. గ్రామ స్వరాజ్య స్థాపన వైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శరవేగంగా అడుగులు వేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరిక నిర్మూలన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. గ్రామంలో 6,233 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.12,82,34,333 లబ్ధిచేకూరిందన్నారు. కరోనా మహమ్మారి సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సీఎం వైఎస్ జగన్ లబ్ధి చేకూర్చారన్నారు. పాలనలో ఉన్న సమయంలో ఒకలా, ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించే చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి వారి అందిన పథకాలు తెలుసుకోవటంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, సర్పంచి గంగుల రత్నప్రసాద్, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ నాగలక్ష్మి, రేపల్లె రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి మేరుగ నాగార్జున


సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

అమర్తలూరు(వేమూరు): గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గత ప్రభుత్వాలు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో రోడ్లు, కరెంట్ స్తంభాలు వేయలేదన్నారు. అందువల్ల కరెంట్, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వాలు అరకొరగా ఇళ్ల స్థలాలు ఇచ్చి అభివృద్ధి చేయకుండా వదిలేశాయని, అందువల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని కాలనీల్లో రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎంపీపీ రావర్ల నరేంద్ర, జడ్పీటీసీ మూల్పూరు లావణ్య, మండల కో–ఆప్షన్ మెంబరు అరమళ్ల మాణిక్యం, గ్రామ సర్పంచి దేవరకొండ రాము, సొసైటీ అధ్యక్షులు యలవర్తి సురేష్, చదలవాడ రమేష్, ఎంపీటీసీలు రావర్ల వల్లిక రాణి, బర్మా ప్రవీణ్, దోవా రవీంద్రబాబు, నూతక్కి శంకర్, కొండముది భాస్కర్, షేక్ హుస్సేన్, మండే కోటేశ్వరరావు, మానుకొండ దానియేలు, అమర్తలూరు వెంకయ్య, పోతర్లంక సురేష్, అంబటి రామోహనరావు, సర్పంచ్ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోన రఘుపతి


లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల కర పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికి వెళ్లి మూడున్నర సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే గ్రామంలో అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే వెంటనే తెలియజేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలను సక్రమంగా అందేవి కాదని జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికి పథకాలు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి గడప వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న పోతుల హరిబాబు, ఆట్ల ప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ గోపాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ ఫిజీషియన్

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ


ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ

వెల్లటూరు(భట్టిప్రోలు): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని బాపట్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ తెలిపారు. శనివారం ఆమె భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో లేబర్ రూమ్, వార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కోళ్లపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యురాలు చావలి రామలక్ష్మి అందిస్తున్న సేవలను పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్‌ను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట హెచ్‌వీలు రాజ్యలక్ష్మి, బుల్లెమ్మ, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని బీఎఫ్ఎస్ స్కూల్లో చదువుతున్న 80 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచి కూచిపూడి సతీష్ కుమార్, సాహిత్య అకాడమీ డైరెక్టరు ఓలేటి శివాజీ, వీరగంధ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి ప్రత్యేక శ్రద్ధ

జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జె.హనుమంతరావు


పెదపాలెం లే అవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డాక్టర్ జె.హనుమంతరావు

పెదపాలెం(భట్టిప్రోలు): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జె.హనుమంతరావు పేర్కొన్నారు. హౌసింగ్ డే పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని పెదపాలెం గ్రామంలోని లే అవుట్‌ను గ్రామ సర్పంచ్ ఎస్.ఉషారాణి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామని చెప్పడంతో ఎనిమిది మందికి ఒక బేల్దారి మేస్త్రీని అప్పగించి డ్వాక్రా గ్రూపులో ఉన్న వారికి రూ. 35 వేలు అందించి వారిని నిర్మాణాలు చేపట్టేందుకు ఉద్యుక్తులను చేయడం జరిగిందని హనుమంతరావు తెలిపారు. అనంతరం భట్టిప్రోలు–1 సచివాలయంను సందర్శించారు. సిబ్బందికి సూచనలు అందజేశారు. స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని, గ్రామంలో ఎస్ఎంసీ షెడ్డును, భట్టిప్రోలు పీహెచ్‌సీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, భట్టిప్రోలు సర్పంచి దారా రవి కిరణ్మయి, ఇన్‌చార్జి కార్యదర్శి ఎ.రామ్‌కుమార్, సచివాలయ కార్యదర్శి పి.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీరాములు, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు కె.రామమోహనరావు, శేతు రామచంద్రరరావు, హెచ్ఎం సి.రామకోటేశ్వరరావు, వైద్యుడు ఎ.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి...

జంపని(వేమూరు): జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని రేపల్లె డీఎల్‌డీఓ బాలమ్మ తెలిపారు. జంపనిలో శనివారం జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నా ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణంపై సరైన అవగాహన లేకపోవడంతో ముందుకు రావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆమె గ్రామ సచివాలయ, గృహ నిర్మాణం శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలు చేపట్టేవిధంగా చూడాలని వారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత, హౌసింగ్ డీఈ రవి కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రేపల్లె: రోగులను సకాలంలో వైద్యశాలలకు తరలించి ప్రాణాలు నిలబెట్టే 108 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని 108 సిబ్బంది రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావుకు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావుకు శనివారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు వేతనాలను పెంచి 108 నిర్వహణ సంస్థ అయిన అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ద్వారా చెల్లిస్తున్నారన్నారు. సర్వీసెస్ సంస్థ అధికారుల వేధింపులతో ఉద్యోగం ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు తొలగిస్తారో తెలియని పరిస్థితుల్లో అనేక సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. చిన్న కారణాలకు సరైన విచారణ లేకుండా డివిజన్ ట్రాన్స్‌ఫర్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌ఫర్, సస్పెన్షన్, టెర్మినేషన్ వంటి నిర్ణయాలతో యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీ మోపిదేవి 108 ఉద్యోగులతో మాట్లాడుతూ సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో 108 సిబ్బంది ఎస్.మహేష్, శివశంకర్, ఖాన్, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన


అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో తొమ్మిదోస్థానం పొందిన మన్నెం లీలా ప్రవళిక

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం విద్యార్థిని జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని గ్రామ సర్పంచి కుంభం అనూష ప్రసన్నరాజు అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో గల మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మన్నెం లీలా ప్రవళికను అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అసోంలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని తొమ్మిదోస్థానం, అదేవిధంగా శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలలో 1500 మీటర్లు, 800 మీటర్లు, మొదటిస్థానం సాధించడం గర్వించదగిన విషయమని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినిని అభినందించిన వారిలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, హెచ్ఎం బెజ్జం పద్మారావు, సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ కూనంపూడి దేవేంద్రరాజు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గుమ్మడి సీతయ్యలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పల్లెకోన విద్యార్థులు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పల్లెకోన(భట్టిప్రోలు): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు భట్టిప్రోలు మండలం కారుమూరు–పల్లెకోన జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పి. సమీర (10వ తరగతి) ఎంపికైనట్లు హెచ్ఎం వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. అలాగే ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా నీలిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో కూడా సమీరా ఆడనున్నట్లు చెప్పారు. అదేవిధంగా హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మోర్ల సౌమ్య ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్నం అనగావల్లిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిరువురికి హైస్కూల్ టీచర్ ఎం.విద్యా సాగర్ క్రీడా దుస్తులు బహూకరించారు. ఎంపికైన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ పోటీలకు సూరేపల్లి విద్యార్థిని..


యరగళ్ల వీరరాఘవమ్మ

సూరేపల్లి(భట్టిప్రోలు): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీవరకు కర్నూల్‌లోని మాంటిస్సోరీ ఎ క్యాంపస్‌లో జరగనున్న అండర్–17 వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలకు భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ పదవ తరగతి విద్యార్థిని యరగళ్ల వీరరాఘవమ్మ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరఫున ఎంపికైనట్లు హెచ్ఎం కె. శ్రీనివాస శర్మ శనివారం తెలిపారు. ఈ జట్టుకు కోచ్‌గా హైస్కూల్ పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావు ఎంపికయ్యారు. వీరరాఘవమ్మ, నాగేశ్వరరావులను హెచ్ఎం శర్మ, వేపూరి చలమయ్య తదితరులు అభినందించారు.

మత్తుపదార్థాలతో జీవితాలు చిత్తు

సెబ్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సెబ్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్

రేపల్లె రూరల్: మత్తుపదార్థాలు తీసుకోవటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సెబ్ ఇన్‌చార్జి సీఐ డి.శ్రీనివాస్ తెలిపారు. మత్తు పదార్థాలు, నాటుసారా వంటి వాటిని తీసుకోవటంతో కలిగే దుష్ప్రభావాలు, ప్రమాదాలపై మండలంలోని పేటేరు గ్రామంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖైనీ, గుట్కా, నాటుసారా, తంబాకు వంటి పదార్థాలు తీసుకోవటంతో అనేక వ్యాధులబారిన పడే ప్రమాదముందన్నారు. గొంతు, నోరు, మెడ, అన్నవాహిక ఇతర ఏరోడైజెస్టివ్ ట్రాక్ట్(గొంతు నుంచి జీర్ణకోశం వరకు) క్యాన్సర్‌ల మహమ్మారి బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. నాటుసారా, ఇతర మద్యం సేవించిన దుష్పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.